క్లుప్తంగా

గుంటిగంగమ్మకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న గుంటి గంగాభవానీ అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటి గంగాభవానీ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే ఉన్న మల్లికార్జున స్వామి, నాగమ్మతల్లి పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పొంగించి నైవేద్యం నివేదన చేశారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దదోర్నాలలో భక్తుల రద్దీ


గణపతి చెక్‌పోస్టు పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీ

పెద్దదోర్నాల: కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధి గాంచిన శ్రీశైల పుణ్యక్షేత్రానికి భారీగా తరలి వచ్చే భక్తులతో ఆదివారం మండల కేంద్రంలో భారీ రద్దీ ఏర్పడింది. దీంతో మండలంలోని శ్రీశైలం రహదారులు వాహనాలతో కిక్కిరిశాయి. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు, గుంటూరు, కర్నూలు వంటి సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైలానికి అధికంగా యాత్రికులు తరలి వస్తుండటంతో ఎస్సై మహేష్ ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు పలు ప్రాంతాల్లో సిబ్బందిని నియమించారు.

ప్రభుత్వ ఖాజీగా ఇబ్రహీం నియామకం


షేక్ ఇబ్రహీం

త్రిపురాంతకం: త్రిపురాంతకం మండల ఖాజీగా షేక్ ఇబ్రహీంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఖాజీగా పనిచేసిన మొఘల్ మీర్జా రజా బేగ్ ఇటీవల మృతి చెందారు. దాంతో ఆయన స్థానంలో ఇప్పటికే ఒక ఖాజీ ఫిదాయతుల్లాను నియమించారు. తిరిగి మరొకరికి ఖాజీగా ఇబ్రహీంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలువురు ముస్లింలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా రామాలయ వార్షికోత్సవం

పొదిలి: స్థానిక కాలేజీ రోడ్డులోని సీతారామచంద్ర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ పునఃనిర్మాణ ఉభయదాత వేంపాటి పోలిరెడ్డి, రమణమ్మ దంపతుల ఆధ్వర్యంలో కలశాలు ఊరేగించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు, హోమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను తిలకించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం పంపిణీ చేశారు.

పొగాకు సాగు వైపు రైతన్న చూపు


పుల్లలచెరువు మండలంలో సాగు చేస్తున్న పొగాకు


నాయుడుపాలెంలో ఎండపెట్టిన పొగాకు

పుల్లలచెరువు: ఏటా దిగుబడులు రాక నష్టపోతున్న రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతున్నారు. మిర్చి, కంది, పత్తి, వరి పంటలు వేసే రైతులు ఈ ఏడాది ఎక్కువగా పొగాకు పంట వైపు మొగ్గుచూపారు. పొగాకు సాగుకు తక్కువ పెట్టుబడితో పాటు ఎక్కువ లాభాలు వస్తుండడంతో ఈ పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పుల్లలచెరువు మండలంలో చాపలమడుగు, చెన్నంపల్లి, సి.కొత్తపల్లి గ్రామాల్లో మాత్రమే గతంలో పొగాకు సాగుచేసేవారు. కానీ ఈ ఏడాది మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో పొగాకు పంటను రైతులు సాగుచేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది దాదాపు 400 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. గత ఏడాది కిలో రూ.140 నుంచి రూ.160 వరకు ధరలు ఉండడంతో సాగు చేసిన రైతులకు లాభాలు పొందారు. ఈ సారి కూడా ధరలు ఆశాజనకంగా ఉంటాయని ఆశతో రైతులు ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారు.

మిర్చి, పత్తిపై సన్నగిల్లుతున్న ఆశలు

రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన మిరప పంటకు వైరస్ తెగుళ్ల సోకి పంటలతో పాటు దిగుబడులు కూడా పూర్తిగా తగ్గుతున్నాయి. పత్తి పంటకు పురుగు సోకి దెబ్బతినడంతో రైతులు చేసేది లేక కొందరు పొగాకు సాగు చేస్తున్నారు. నవంబర్ వరకు పొగాకు సాగుకు అనుకూలం కావడంతో ఖరీఫ్‌లో సాగుచేసిన కొన్ని పంటలను తొలగించి మెట్ట ప్రాంతాల రైతులు పొగాకు నాటుతున్నారు. ఎకరానికి కనీసం 10 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. సరాసరి క్వింటా రూ.15 వేలు పలికినా ఎకరానికి రూ.2 లక్షల ఆదాయం వచ్చే అవకాశం రైతులకు ఉంది.

ఇంకా పొగాకు వేస్తున్నారు

గతంలో కంటే ఈ ఏడాది పొగాను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. దాదాపు ఇప్పటి వరకు దాదాపు 400 ఎకరాల్లో సాగు చేశారు. మరి కొందరు పొగాకు నాట్లు వేస్తున్నారు. ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఖరీఫ్ ఈ–పంట నమోదు పూర్తయితే ఎంత నాటింది కచ్చితమైన లెక్క వస్తుంది.

– నిర్మలాదేవి, వ్యవసాయాధికారి, పుల్లలచెరువు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో వేనూతల కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన వేనూతల కాటమ రాజుస్వామి, గంగాభవానీ ఆలయం, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవతకు, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో నాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం విశేష పూజలు చేశారు. ఆలయ పూజారి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవారికి వారికి సమర్పించారు. మహిళలు నాగమయ్య పుట్టలో పాలు పోసి పండ్లు, పొంగళ్లు, అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, గాజులు, చీరలు మహిళలు సమర్పించారు. కార్తీకమాసం సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

రేపు ఒంగోలులో ర్యాలీని విజయవంతం చేయాలి


కార్మికులతో మాట్లాడుతున్న అంజయ్య

దొనకొండ: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26వ తేదీ ఒంగోలులో నిర్వహించనున్న ర్యాలీ, సభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పౌర సరఫరాల గోడౌన్ వద్ద ముఠా కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడం లేదని, ధరలు చూస్తే రెట్టింపుగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు చెప్పినా స్కీమ్ కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. వారు ఎంత కాలం పనిచేసినా పర్మినెంట్ చేయడం లేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ట్రైనీ గౌరవ వేతనం పేర్లతో కార్మికులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. కడుపు నిండకపోతే కార్మికులు తిరగబడతారనే విషయం పెట్టుబడిదారులకు తెలుసన్నారు. ఉపాధి పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచి ఈ సంవత్సరం 6 కోట్ల మంది లబ్ధిదారులను తగ్గించిందన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కార్మికవర్గాన్ని చీల్చాలని బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం ప్రయత్నిస్తోందన్నారు. కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడమే మన మార్గమని, కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎదురించాలని పిలుపునిచ్చారు. అందుకోసం ఈ నెల 26వ తేదీ ఒంగోలులో జరగబోయే ర్యాలీ, బహిరంగ సభలో ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని అంజయ్య కోరారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కుందుర్తి చిన్న నరసింహులు, ఎం.వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలి


సభలో మాట్లాడుతున్న రెడ్డి జాగృతి సలహాదారుడు నాసర్‌రెడ్డి


కోలాటంలో పాల్గొన్న మహిళలు

- రాష్ట్ర రెడ్డి జాగృతి సలహాదారుడు ఆవుల నాసర్‌రెడ్డి

యర్రగొండపాలెం: సామాజిక కార్యక్రమాల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ ముందుండాలని, పేదలకు సహాయ సహకారాలు అందిస్తూ సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలని రాష్ట్ర రెడ్డి జాగృతి సలహాదారుడు ఆవుల నాసర్‌రెడ్డి అన్నారు. కార్తిక వనభోజనాల సందర్భంగా రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ అభివృద్ధితోపాటు పేద వర్గాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థుల చదువుల కోసం ఇతోధికంగా సహాయం చేయాలని ఆయన కోరారు. యర్రగొండపాలెం పట్టణంలో తొలి స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి చేసిన తీర్మానాన్ని ఆ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ముందుగా సత్యనారాయణ స్వామి వ్రతం, శివపార్వతుల కల్యాణోత్సవం, కార్తీక దీపోత్సవం, జమ్మి, ఉసిరి చెట్ల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మార్కాపురం మహిళా విభాగం వారి కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో యర్రగొండపాలెం, మార్కాపురం రెడ్డి సామాజిక సేవా సంఘం అధ్యక్షుడు బిజ్జం రమణారెడ్డి, గుంటక సుబ్బారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు జి.వనజాక్షి, సంఘం నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, మోర్తాల సుబ్బారెడ్డి, శనగ నారాయణరెడ్డి, బోగోలు వెంకట సుబ్బారెడ్డి, పేరం నాగిరెడ్డి, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి, యర్రా లక్ష్మిరెడ్డి, కేసిహెచ్ ఓబులరెడ్డి, ఆవుల రమణారెడ్డి, ఆవుల పెద్ది చెంచిరెడ్డి, పాలం నందిరెడ్డి, నారు నాసర్‌రెడ్డి, కందుల నారాయణారెడ్డి, కొల్లి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


దారిని కమ్మేసిన ముళ్లపొదలు

- రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు


చాట్లమడ అగ్రహారం నుంచి రామాయపాలెం గ్రామానికి వెళ్లే రహదారిపై ముళ్లపొదలు

పెద్దారవీడు: మండలంలో అనేక గ్రామాల్లో ప్రధాన రహదారులు ముళ్ల కంప చెట్లు కమ్మేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రామాయపాలెం నుంచి చాట్లమడ, చాట్లమడ అగ్రహారం, కక్రోల, ఏనుగులదిన్నెపాడు గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా చిల్లకంప చెట్లతో కమ్మేయడంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూలమలుపుల వద్ద తారురోడ్డు మూసుకుని చెట్ల కొమ్మలు ముందుకు రావడంతో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనం కనిపించక ప్రమాదాలు జరిగిన సంఘటన ఎన్నో ఉన్నాయని స్థానికులు తెలిపారు. తారురోడ్డుకు ఇరువైపులా చిల్ల చెట్ల కంపను తొలగించాలని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిలో పొలాలు ఉండటంతో ముళ్లపొదల్లో నుంచి అడవి పందులు వచ్చి తగులుతాయని, రాత్రిళ్ల రాకపోకలు సాగించాలంటే భయంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. రోడ్డుపై కమ్మేసిన ముళ్లపొదలు ముఖానికి, చేతులకు ముళ్ల తగులుకుని గాయాలవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లకంప పొదళ్లను తొలగించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంధకారంలో ఉల్లగల్లు ఎస్సీకాలనీ


వెలగని వీధి లైటు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పెద్ద ఉల్లగల్లు ఎస్సీకాలనీలో విద్యుత్ స్తంభాలకు పిచ్చి చెట్లు అల్లుకుని పైవరకూ ఎగబాకి విద్యుత్ లైట్లను సైతం చుట్టుముట్టాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా చిల్లచెట్లు అల్లుకున్నాయి. కొన్నిచోట్ల లైట్లు మరమ్మతులకు గురై వెలగడం లేదు. చిల్ల చెట్ల వలన వీధిలైట్లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖాధికారులు, సిబ్బందికి స్థానికులు అనేకసార్లు తెలియజేసినా స్పందించక పోవడంతో రాత్రివేళల్లో వీధిలైట్లు లేక అంధకారం నెలకొందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చిల్లచెట్లు తొలగించి విద్యుత్ లైట్లు వెలిగించాలని ప్రజలు కోరుతున్నారు.


విద్యుత్ స్తంభంపైకి పాకిన చిల్లచెట్లు


ట్రాన్స్‌ఫార్మర్‌ను చుట్టేసిన చిల్లచెట్లు

రాష్ట్ర ఉత్తమ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా సురేష్


అవార్డు అందుకుంటున్న సురేష్

దర్శి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ అవార్డును మండలంలోని పాతకమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు యు.సురేష్‌బాబు అందుకున్నారు. ఏపీఎస్‌ఎస్‌టీఎఫ్ తరఫున 2024వ సంవత్సరానికి సురేష్ చేసిన కృషికి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. విజయనగరంలో జరిగిన ఏపీఎస్‌ఎస్‌టీఎఫ్ 75వ రాజ్యాంగ దినోత్సవంలో సురేష్‌కు అవార్డు అందజేశారు. సురేష్ గతంలో 10 సంవత్సరాలు పోలీస్‌శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించారు. అప్పట్లో ఉమేష్ చంద్ర ఐపీఎస్ స్మారక రాష్ట్ర ఉత్తమ కానిస్టేబుల్ అవార్డు కూడా పొందారు. బోధనా రంగంపై మక్కువతో పోలీస్ ఉద్యోగం నుంచి ఉపాధ్యాయ వృత్తికి మారారు. ఇక్కడ కూడా ఉత్తమ అవార్డు అందుకున్న సురేష్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

27న సామూహిక రుద్ర పూజలు

గిద్దలూరు రూరల్:

పట్టణంలోని కాశినాయన కుంట సమీపంలో గల శ్రీరామకృష్ణ ధ్యాన మందిరంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు సామూహిక రుద్ర పూజలు నిర్వహించనున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకులు బీఎస్ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా సామూహిక రుద్రపూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నామన్నారు. తీర్థప్రసాదాలతోపాటు అల్పాహారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆదిశంకరాచార్యులుకు నూతన రజత మకరతోరణం

మార్కాపురం: స్థానిక మార్కండేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని జగద్గురు ఆది శంకరాచార్యుల వారికి ఆదివారం నూతన రజత మకర తోరణం, రజత సర్వజ్ఞ పీఠాలను అలంకరించారు. ఆది శంకరాచార్యులు వారి ఉపాలయ దశాబ్ది మహోత్సవంలో భాగంగా దాతల సహకారంతో చేయించిన తోరణం, పీఠాన్ని భక్తుల జయజయ ధ్వానాలు, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అంతరాలయానికి చేర్చారు. ముందుగా ఆలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఈఓ చెన్నకేశవరెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు. బ్రాహ్మణ సంఘాల ప్రముఖులు గోపాలుని హరిహరరావు, పురాణం సుబ్రహ్మణ్యం, సోమయాజుల సుబ్బశాస్త్రి, కమలాపురి శ్రీనివాస్, హరి, కాళంరాజు శ్యాంసుందరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణ అన్న సంతర్పణ నిర్వహించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో ముద్దసానమ్మ అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి


ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ


కాలేజీ రోడ్డులో పూజలందుకుంటున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్:

స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లోని పుట్ట, నాగ శిలలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే స్థానిక కాలేజీ రోడ్డులోని పోలేరమ్మ ఆలయంలో అర్చకుడు అమర్నాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

ముద్దసానమ్మ ఆలయంలో..

మార్కాపురం రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జమ్మనపల్లి గ్రామ సమీపంలో ముద్దసానమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మార్కాపురం పట్టణంతోపాటు పలు గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు


జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఆక్రమణల తొలగింపు ఆదివారం కూడా కొనసాగింది. వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ కాలువలపై ఏర్పాటు చేసిన బంకులు, దుకాణాలు, రేకులషెడ్లు తొలగించారు. అయ్యప్పస్వామి గుడికి సమీపంలో ఉన్న ఆక్రమణలను ఆదివారం జేసీబీతో కూల్చివేశారు. కాగా పట్టణంలోని మెయిన్‌బజారు, అమ్మవారిశాల, తేరుబజారు, నాయుడు బజారులో పలువురు తమ ఇళ్ల ముందు ఉన్న మెట్లు, బంకులు, రేకులను స్వచ్ఛందంగా తొలగించారు. గాంధీ పార్కు తూర్పువైపున ఉన్న ప్రహరీ గోడను కూల్చివేసి ఇనుప గ్రిల్స్‌ను తొలగించారు.